౧

వ్యావహారిక భాషా బహిష్కార నిరసనము

పదిపండ్రెండేండ్ల క్రిందట గ్రామ్యగ్రాంథిక వాదము చెలరేగినప్పుడు ఆంధ్రసాహిత్యపరిషత్తువారు పంతగించి, వ్యావహారిక భాష గ్రామ్యమని దూషించి దానిని బహిష్కరించినారు. వారు ఏ పండితులతో ఈ విషయమై సంవదించినారో వారిలో అధిక సంఖ్యాకులు ఇందుకు సమ్మతించేటట్టు చేసినారు. "సంస్కృతమందు వైదిక భాషకును లౌకిక భాషకును వ్యాకరణ సిద్ధమైన భేద మెట్లు కలదో ఆ తెఱఁగుననే యాంధ్రమందును గ్రాంథిక భాషకును వ్యావహారిక భాషకును భేదము గ్రహింపవచ్చుననియు, లౌకిక భాష కేవల గ్రామ్యమని విసర్జింపక దానికిం దగినట్లు వ్యాకరణ మేర్పఱచి యట్టి వ్యాకరణము ననుసరించి వ్యావహారిక భాషను గ్రంథములం బ్రయోగించుట కాక్షేపణ యుండఁగూడ"దనియు ప్రఖ్యాతపండితు లయిన శ్రీ పేరి కాశీనాథశాస్త్రులవారు చేసిన హితోపదేశము తృణీకరించినారు. లోకమందంతటా ఏ కాలమందు ఏ భాష శిష్టవ్యవహారమందు ఉంటుందో అదే దేశభాష అనిన్ని, దానిలోనే అందరూ చదువుట కుపయోగించే గ్రంథములు రచించడము సదాచారముగా ఉన్నదనిన్ని, ఇంగ్లాండు మొదలయిన దేశములందు నెలకొని ఉన్న సత్సంప్రదాయము చొప్పున శ్రీ గురజాడ వేంకటఅప్పారావు పంతులుగారున్ను నేనున్నూ చేసిన యుపదేశము త్రోసి పారవేసినారు. అటుపిమ్మట పరిషత్తువారే కొందరు

ఈ వ్యాసము "భారతి" మొదటి సంపుటము, 5, 6, సంచికలనుండి పునర్ముద్రితము.

విద్వాంసులను అన్ని పట్టణములకు పంపి, ఈ బహిష్కారము చాటింపించి, ఊరూరా సభలు కావించి, ఈ బహిష్కారము ఆంధ్ర మహాజనులు అంగీకరించినట్టుగా తీర్మానములు చేయించినారు. పదివేల సంతకములతో ప్రజల పేరిట మహజర్ వామా ప్రభుత్వమువారికి అందజేయించినారు. అందులో వ్యావహారిక భాషను గ్రంథములు రచించుట పూర్వ సంప్రదాయమునకు విరుద్ధమనీ, అట్టి గ్రంథములు దేశమందు లేవనీ, ఉంటే అవి గ్రాంథిక భాషాజ్ఞానము లేనివారు వ్రాసినవనీ, ఈ కాలమందనేకులు నిర్దుష్టముగా గ్రాంథికాంధ్రమున నానావిధమైన గ్రంథములున్ను అనేకముగా రచిస్తున్నారనీ, వేలకొలదిగా వాటి ప్రతులు పట్టణములలోను పల్లెలలోనూ ఆబాలగోపాలం అందరూ కొని చదువుతూ ఉన్నారనీ, బడులలో పిల్లలచేత గ్రాంథికాంధ్రాభ్యాసము చేయించడమే ప్రజలందరికీ ఇష్టమనీ, వ్యావహారిక భాషాభ్యాసము ఎవ్వరికీ ఇష్టముకాదనీ గట్టిగా గవర్నమెంటువారికి నచ్చజెప్పినారు. అర్జీలు, టెలిగ్రాములు, పత్రికలు, పుస్తకాలు అపరిమితముగా కురిపించి అందరిని అదలగొట్టినారు. కర్జన్ ప్రభువు నిరంకుశ ప్రభుత్వమునకు ప్రతికూలముగా అధికార వర్గమునకు ప్రతిఘటించి ప్రభుత్వమువారిని ప్రజల ప్రతినిధులకు లొంగేటట్టు చేయుటకు పూనుకొని ఉన్న గౌ. శ్రీ నరసింహేశ్వర శర్మగారు మొదలయినవారు ఈ విషయము తమ పనికి అనుకూలముగా నున్నందున ఇది ఆధారముగా జేసుకొని విద్యాధికారులు బడులలో ప్రవేశపెట్టిన వ్యావహారిక భాషను బహిష్కరించి ప్రజల స్వాతంత్ర్యము సాధించి కృతకృత్యులైనారు గాని దేశభాషను పరిషత్తుకు పండితులకు సొత్తు కిచ్చివేసినవారయినారు. ఇట్లే యూనివర్సిటీవారి వ్యావహారిక భాషాభిమానముకూడా గ్రాంథికభాషాభిమానుల నీతితంత్ర ప్రయోగముచేత విఫలమైనది. యూనివర్సిటీవారు నిర్ణయించిన కాంపోజిషన్ కమిటీలో నలుగురు గ్రామ్యవాదులున్ను నలుగురు గ్రాంథికవాదులున్ను ఇద్దరు మధ్యస్థు

లున్ను మొదట ఉండిరి. మధ్యస్థులు ఇద్దరున్ను గ్రామ్యవాదులతో ఏకీభవించి శిష్టవ్యవహారమందున్న భాష గ్రామ్యమన్నారు. ఆ తీర్మానము తమకు ప్రతికూల మవుటవల్ల గ్రాంథికవాదులు, తమకుగల పలుకుబడిచేత మరి నలుగురు గ్రాంథికవాదులను ఏదో సాకు కల్పించి కమిటీలో చేర్చుకొన్నారు. అందుచేత వారి పక్షమువారు కమిటీలో అధిక సంఖ్యాకులయి మొదటి తీర్మానము నిరర్థక మయేటట్లు చేసినారు.

పరిషత్తువారు చాలా ధనము కర్చుపెట్టి చాలా శ్రమపడి వ్యావహారికభాషాభ్యాసమువల్ల సారస్వతము నశించి దేశమునకు ఉపద్రవము కలుగుతుందని ప్రజలను, ప్రభుత్వమువారిని, విద్యాధికారులను నమ్మించుటకై చెప్పిన మాటలన్నీ యథార్థమయినవి కావనిన్నీ దురభిమానముచేత తాము మోసపోయి లోకమును మోసపుచ్చినారనిన్నీ ఈ వ్యాసమందు ఋజువు చేస్తాను. వ్యావహారికభాష అపరిమితప్రయోజన మైనదనీ గ్రాంథికభాష పరిమితప్రయోజనమై పండితలోకమునకైనా సులభము కాదనీ సప్రమాణముగా నిరూపిస్తాను. వ్యావహారిక భాషాబహిష్కారము చెల్లదనీ, గ్రాంథిక భాషనే గ్రంథములన్నీ రచించవలెనని నియమ మేర్పరచుటవల్ల చక్కగా దేశభాష వృద్ధిపొందదనీ ప్రజలలో విద్య చక్కగా వ్యాపించదనీ స్పష్టముగా తెలియజేస్తాను.

సాహిత్యపరిషత్తువారు వ్యావహారికభాష నిష్ప్రయోజనమనో అనర్థకమనో భావించి బహిష్కరించినారు. సంభాషణలలోకూడా ఈ బహిష్కారము చెల్లవలెననే వారి సంకల్పమయినట్టు కనబడుతున్నది. కీర్తిశేషులయిన కొక్కొండ వెంకటరత్నము పంతులవారివలె ఇంటిలోను వీధిలోను బాజారులోను కాకపోయినా బడులలోను న్యాయస్థానములందు కార్యస్థానములందు సభలలోనయినా గ్రాంథికభాషనే మాట్లాడుట అందరు అభ్యసించవలెనన్నారు. ఈ పది సంవత్సరములలో పరిషత్ప్రముఖులై

అధమపక్షము అధ్యక్షులుగా నుండేవారయినా గ్రాంథికాంధ్రము యాదృచ్ఛిక సంభాషణమందు వాడడము అలవాటు చేసుకొన్నారా? వారి బహిష్కారశాసనము ప్రకటించినప్పుడే నేను రచించిన మెమోరాండములో "ఈ శాసనమునొప్పిన గ్రాంథికాంధ్రము మాట్లాడనేరనివారిని పరిషత్తులో నుండి తొలగించవలసి ఉంటుంది; అట్లా చేస్తే ఒక్కరయినా పరిషత్తులో నిల్చి ఉంటారా?" అని అడిగినాను. తామే అనుసరించలేనప్పుడు తమ శాసనము లోకములో చెల్లుతుందా? దానిని లోకులందరూ అనుసరించగలరనుకొన్నారా? ప్రకృతివిరుద్ధముగా కొన్ని కుక్కలను గాడిదలను అత్యంత కఠినశిక్షచేత సర్కసులో నేర్పరులు ఆడించగలిగినట్లు పరిషత్తువారు ప్రజలందరిచేతనూ "గ్రాంథికభాష" మాట్లాడించగలరా? ఓహో! అవివేక విలసితము! భాష అంటే ఏమిటో ప్రజలకు భాష ఏలాగున అలవడుతుందో చిన్నప్పటినుండిన్ని వాడుతూ ఉన్న భాష పెద్దవాళ్లకు విడిచిపెట్టడము ఎందుకు అసాధ్యమో లోకమందెక్కడా చెవిని బడని భాష పుస్తకాలలో చదువుకొని నోటను స్వేచ్ఛగా ఎందుకు మాటలాడలేరో, అట్టి భాష ప్రజలందరికీ విద్యనేర్పుటకు ఎందుచేత ఉపచరించదో తెలియనివారు ఎంత గొప్పవారైతే నేమి దేశభాషజోలికి రాకూడదు. ఇతర విషయములలో వారికి గల గొప్పతనమూ పలుకుబడీ చూచి ప్రజలు భ్రమపడి వారి శాసనము దేశమునకు హితమయినదని నమ్మినారు గాబోలు. అయితే నమ్మినవారు ఎవరూ నమ్మినదానిని ఆచరించినట్లు తోచదు. పరిషత్తువారి బహిష్కారశాసనము ప్రకటితమైన పిమ్మటనే గాంధీమహాత్ముని ఉపదేశమూలముగా మన దేశమందు అంతటా పుట్టి దినదినప్రవర్ధమానమయి పట్టరాకుండా ఉన్న ఉత్సాహమువల్ల స్వాతంత్ర్యాభిలాష స్వదేశాభిమానము స్వరాజ్యేచ్ఛ సంఘజీవనమందు తక్కిన వ్యాపారములను వికసింపజేస్తూ ఉన్నట్టే సకల వ్యవహార విద్యాప్రవాహమునకు పరమసాధనమైన దేశభాషనుకూడా అనేక విధముల

విజృంభింపజేస్తూ ఉన్నది. పరిషద్బహిష్కారము పాటించకుండా వ్యావహారిక భాషలో పుస్తకములు వ్యాసములు అనేకముగా రచించి ప్రకటిస్తున్నారు. సభలలో అందరూ వ్యావహారిక భాషలోనే యథేచ్ఛముగా ఉపన్యాసములు చేస్తున్నారు. అధ్యక్షులుకూడా ఆ భాషే వాడుతున్నారు. అందులో తీర్మానములు వ్రాస్తున్నారు. గోదావరీకృష్ణవేణీనదీప్రవాహములవలె సర్వసౌభాగ్యప్రదమై దేశనాయకుల ముఖములనుండి వాస్తవమైన దేశభాష వెల్వడి దేశస్థుల వ్యవసాయము సఫలము చేస్తున్నది. దాని యోగ్యత దాని ఔచిత్యము దాని మాధుర్యము దాని ప్రాశస్త్యము అందరు చవిచూస్తున్నారు. దాని సౌలభ్యము దాని ప్రాచుర్యము దానిని అందరికీ ఆదరణీయముగా చేస్తున్నవి. తెలుగువారికి వాస్తవమైన దేశభాష ఇదే అని బోధపడుతున్నది. గాంధీమహాత్ముడు తెలుగువారితో తెలుగున మాట్లాడగోరితే ఈ తెలుగేకదా నేర్చుకొని అభ్యసించవలెను? ఈ తెలుగువంటిదేకదా ఆయనా ఆయన సతీమణి కస్తూరిభాయిగారూ మాట్లాడే గుజరాతీ. అట్టి గుజరాతీలోనేకదా ఆచార్య గిద్వానీగారు తన శిష్యులకు పుస్తకములు రచించుచున్నట్టు గుజరాతీవిద్యాపీఠ కార్యనివేదనమందు ప్రకటించినారు. శ్రీ రవీంద్రనాథ ఠాకూరుగారి బంగాళీకూడా ఈ తెలుగువంటిదే. ఆయన రచించిన సుప్రసిద్ధ కావ్యములకు అదే ఉచితమైనది. యేసుక్రీస్తుకూడా ఈ తెలుగువంటి యూదుల దేశభాషలోనే పామరులయిన తన శిష్యులకు పరమ ధర్మముపదేశము చేసినాడు. బుద్ధదేవుడు ప్రజలకు అహింసాధర్మము పాలీభాషలో ఉపదేశించినాడు. మనము మాట్లాడే తెలుగువంటిదే వారు ఆ కాలమందు మాట్లాడే పాలీ. బౌద్ధసంఘముల వ్యవహారమంతా వ్యావహారిక భాషలోనే జరుగవలెనని బుద్ధుడు శాసించినాడట.* అన్ని దేశములందున్ను అన్ని కాలములందున్ను ఆబాలగోపాలం అందరికీ ఉపచరించేటట్టు ధర్మోపదేశము చేసిన గురువులం తమ

* Bhandarkar Com. Vol. P. 443

నోటిమాటలతోనే ఉపన్యాసములు చేసినారు. వారి శిష్యులలో వ్రాత నేర్చినవారు ఆ మాటలు వ్రాసిపెట్టుకొని తాము చదువుకొంటూ ఇతరులకు చదివి వినిపించేవారు. ఇదే లోకమందు సంప్రదాయము.

గ్రాంథికాంధ్రమునందు మనవారికి గల గౌరవము భారతాది ప్రాచీన గ్రంథములయందున్న గౌరవమునుబట్టి కలిగినదే; కాని దాని ప్రాచీనత చేతనూ దానిని అభ్యసించుటకు పడవలసిన కష్టముచేతనూ కలిగినదికాదు. ప్రాచీనభాషలన్నీ ప్రాచీనకాలమందు వాడుకలో సర్వజనసామాన్యమైనవే. విషయమందు స్వతఃలేని గౌరవము ప్రాచీనభాషలో చెప్పితే మాత్రము వస్తుందా? విషయమందు వాస్తవముగా ఉన్న గౌరవము సర్వసామాన్యమైన భాషలో చెప్పితే పోతుందా? లేక తగ్గుతుందా? భాష పరమార్థము కాదు. అర్థసిద్ధికి సాధనము; ఉపకరణమువంటిది. చిన్నప్పటినుండిన్నీ అందరికీ సామాన్యముగా అలవడ్డ భాషకన్న ప్రయత్నపూర్వకముగా నేర్చుకొంటేనే కాని రానిభాష భావబోధకు అధికానుకూలమైన సాధనమవుతుందా? లౌకికభాష త్యజించేవారికి లోకయాత్ర జరగదు. అవసరోచితముగా వాడుకచొప్పున ఎవరిదర్జాకొద్దీ వారు మాట్లాడవచ్చును. వచ్చీరాని "గ్రాంథికాంధ్రము"తో మాత్రము తమ భాషాపాండిత్యము లోకవ్యవహారమందు ప్రకటింపజేయడము హాస్యాస్పదముగా ఉంటుంది. ఇంటర్ప్రెటర్లు, ట్రాన్సలేటర్లు వారి అభిప్రాయములు వాడుకమాటలతో తెలియజేస్తేనేకాని వ్యవహారహాని కలుగుతుంది. మన దేశభాష రానివారు మన దేశము వచ్చి హిందీలోనో ఇంగ్లీషులోనో ఉపన్యాసములు చేస్తే వాటి అర్థము ఆ భాషలు నేర్చిన తెలుగువారు మనకు తెలిసిన తెలుగున చెప్పక గ్రాంథికాంధ్రములో చెప్పడము వ్యర్థప్రయాసముకాదా? ఒక తెలుగువాడు ప్రాచీనాంధ్రభాషా పండితుడైనా, తెలుగు ప్రజలతో మాట్లాడేటప్పుడు, అందరికీ సుబోధముగా తన వాడుక మాటలే వాడవలెనుగదా.

నిత్యమున్ను జనులందరూ వాడుతూఉన్న భాష రద్దుచేసి, గ్రాంథిక భాష దానికి మారుగా వాడవలసినదని శాసించేవారు వివేకులయితే, గ్రాంథిక మేదో స్పష్టముగా నిరూపించి, దానిని సులభముగా అందరూ నేర్చుకొనుటకు అనుకూలమయిన సాధనములు ముందుగా ఏర్పర్చి ఉందురు. గ్రాంథికభాషాలక్షణము ఇంకా గ్రాంథిక భాషాకావ్యములందే నిగూఢముగా ఉన్నది. ఇప్పుడున్న వ్యాకరణములవల్ల ఆ లక్షణము స్పష్టముగా తెలియదనీ, ఇప్పుడున్న నిఘంటువులవల్ల శబ్దరూపములు శబ్దార్థములు శబ్దప్రయోగములు నిస్సంశయముగా తెలుసుకొనుటకు సాధ్యముకాదనీ, భారతాది ప్రబంధముల పాఠములు ఇప్పటి అచ్చుపుస్తకములలో శుద్ధమయినవని విశ్వసింపలేమనీ, ప్రాచీన గ్రంథములు అచ్చుపడకుండా ఇంకా అనేకమున్నవనీ, అవికూడా శోధించి చూస్తేనేకాని ఆ భాషాలక్షణము సంపూర్ణముగా ఏర్పడదనీ—మ. జయంతి రామయ్య పంతులుగారే విరోధికృన్నామ సంవత్సరాదిసంచికలో "ఆంధ్రభాషాసంఘము" అనే వ్యాసమందు వ్రాసి ప్రకటించినారు. ఇట్లే శ్రీ వేదము వేంకటరాయశాస్త్రులుగారు నెల్లూరిలో జరిగిన పరిషత్సభలో అధ్యక్షోపన్యాసమందున్ను శ్రీవఝల చిన సీతారామస్వామిశాస్త్రులుగారు ఆ సభలోనే ఆంధ్రవ్యాకరణములనుగూర్చి చేసిన ఉపన్యాసమందున్ను విశదపర్చినారు. ఈ భాష కేవల గ్రంథస్థమయి, ప్రయోగశరణముగానే ఉన్నది. ఒక వ్యాకరణమునుబట్టి సాధువనవలసిన శబ్దము మరి ఒక వ్యాకరణమునుబట్టి అసాధువనవలసి ఉన్నది. ఒక కోశమునుబట్టి సాధువుగా కనబడే శబ్దరూపము మరి ఒక కోశమునుబట్టి అసాధువుగా కనబడుతుంది. ఈ భాషలోని శబ్దములరూపము సందిగ్ధము. శబ్దములలో ఔపవిభక్తికము లేవో, అనౌపవిభక్తికము లేవో ఏర్పడలేదు. కావలసిన విభక్తిలోగాని, వచనములోగాని ఏ శబ్దము పడితే ఆ శబ్దము ప్రయోగించుటకు సిద్ధరూపములు తెలిస్తేనేకాని వల్లపడదు. ఏవి నిత్యైక

వచనాలో, ఏవి నిత్య బహువచనాలో తెలియదు. శబ్దమూ శబ్దార్థమూ తెలిసినా, కారకము సందిగ్ధముగా ఉన్నప్పుడు ప్రయోగించుటకు పనికిరాదు. క్రియలన్నిటికీ గ్రాంథికాంధ్రములో ప్రేరణార్థకరూపము లెట్లుండునో వ్యాకరణములవల్లగాని కోశములవల్లగాని తెలియదు. ప్రయోగములైనా ఒక ప్రబంధమునుబట్టి సాధువనదగినవి మరి ఒకదానినిబట్టి అసాధువు లన వలెను. భారతప్రయోగములయినా కూర్పులన్నిటిలో ఒకలాగున లేవు. ఈ భాషాలక్షణము ఇట్లు పరమగహన మవుటచేత మన పూర్వులలోనైనా లెస్సగా సంస్కృతాంధ్రకావ్యములు చదివి నిరంతరభాషారచనాభ్యాసము చేసిన పండితులుమాత్రమే గ్రాంథికాంధ్రమున ప్రబంధములు రచించేవారు. వాటిలోని మంచిచెడ్డలు వారివంటి పండితులే విమర్శించేవారు. ఇది సంస్కృతమువలెనే బహుకాలాభ్యాసము చేసి నేర్చుకోవలసిన భాష. అన్నవస్త్రములకోసము పాటుపడనక్కరలేనివారికే సాధ్యము.

పరిషత్తువారు చక్కగా ఆలోచించకుండా వట్టి గ్రాంథికాంధ్ర భాషాభిమానముచేత "ఈ కాలమందు అనేకులు నిర్దుష్టముగా గ్రాంథికాంధ్రమున అనేక గ్రంథములు రచిస్తున్నారనీ, అవి చదివేవారు వేలకొలదిగా ప్రజలలో ఉన్నారనీ" సభలలోనూ, పుస్తకాలలోను, పత్రికలలోను, మహాజర్లలోను ఊరూరా ప్రకటించీ ప్రజలకున్ను ప్రభుత్వమువారికిన్ని నమ్మకము పుట్టేటంత నిబ్బరముగా దృఢీకరించి చెప్పినారు. అయితే, వారు చెప్పిన మాట లోకమంతా నిజమని నమ్మినా, నేను నమ్మజాలను. నేను విమర్శించి తెలుసుకొన్న విషయము నిర్మొగమాటముగా చెప్పుతాను.

ఇందుకు తార్కాణగా గొప్ప గ్రంథకర్తలని మన కాలమందు ప్రఖ్యాతి పొందినవారినే పేర్కొని చెప్పగలను. గ్రంథకర్త పేరు విని భ్రమప్రమాదములకు లోనుగాక, ఆయన గ్రంథము సవిమర్శముగా చూచినవారు నా మాట వాస్తవమని నమ్మకపోరు. సభలో కొందరు గ్రంథకర్తల

యెదుటనే వారి గ్రంథములలోని భాషాదోషములు నిరూపించి చూపించి నాను. గొప్ప పండితుల గ్రంథములలో తప్పులు పట్టడము సాహసమే; కాని ఆ పని దురుద్దేశముతో చేయలేదని త్రికరణశుద్ధిగా చెప్పుతున్నాను. సుపరిచితము కాని కేవల గ్రాంథికాంధ్రభాషను రచించుటకు పూనుకొంటే పండితులకైనా తప్పులు అనివార్యమైనప్పుడు, అపండితులయినవారికి ఆ భాష సుతరాం అసాధ్యమని రుజువుచేయడంకోసము విధిలేక నేను ఈ పని చేయవలసివచ్చినది. భీమునివంటివాండ్లకే జీర్ణముకాని ఆహారము పిల్లలకు పడదని చెప్పడము తప్పుకాదు. గ్రాంథికాంధ్రభాషారచనకు మార్గదర్శకులు పరవస్తు చిన్నయసూరిగారు. వారి నీతిచంద్రిక మొదటికూర్పు రెండవ కూర్పు వారు స్వయంగా అచ్చొత్తించినారు; వాటిప్రతులు ఆంధ్రసాహిత్య పరిషత్తువారివద్ద నున్నవి. పిమ్మట అనేకమైన కూర్పులు అచ్చుపడ్డవి; ఎన్నో సవరణలు (కొన్ని మంచివీ, కొన్ని చెడ్డవీ) పరిష్కర్తలు చేసినారు; గాని, మొదటి కూర్పులోని తప్పులు కొన్ని ఇంకా నిలిచిఉన్నవి. కొక్కొండ వెంకటరత్నం పంతులుగారిని, కందుకూరి వీరేశలింగం పంతులుగారిని అనేక దుష్ట గ్రంథకర్తలకు ప్రతినిధులుగా గణించి, వారి గ్రంథములలోని భాషాదోషములు శ్రీ వేదం వెంకటరాయశాస్త్రిగారు ప్రకటించినారు. ఈ శాస్త్రిగారి తప్పులు వేలకొలదిగా నేను వారి గ్రంథాలలో చూచినాను. కొన్ని నా తెలుగు పత్రికలలో ప్రకటించి, పత్రిక ప్రతులు వారికి పంపినాను. వీరివంటివారే పురాణపండ మల్లయ్యశాస్త్రిగారు, మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు, కల్లూరి వెంకటరామశాస్త్రిగారు, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు, వావిలికొలను సుబ్బారావుపంతులుగారు, పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారు, కూచి నరసింహము పంతులుగారు, కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు, చెలికాని లచ్చారావు బహద్దరుగారు, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు, జయంతి రామయ్యపంతులుగారు

వంగూరి సుబ్బారావు పంతులుగారు; ఇంకను అనేకులు ఇట్టివారే. వీరు రచించిన గ్రంథములలో "లక్షణవిరుద్ధమయిన శబ్దములు (కొన్నిటిలో అపరిమితముగాను, కొన్నిటిలో కొలదిగాను) నేను కళ్ళారా చూచి ఉన్నాను. విజ్ఞానచంద్రికా గ్రంథమాల, ఆంధ్రప్రచారిణీగ్రంథమాల, వేగుజుక్క గ్రంథమాల, విజ్ఞాన భానోదయ గ్రంథమాల, ఆంధ్రభాషాభివర్ధనీ ప్రచురములు, లక్ష్మీవిలాసకంపెనీ ప్రచురములు, రామాకంపెనీ ప్రచురములు—ఇంకను మరికొన్ని మాలలలోనివి, ప్రచురములలోనివి, ప్రచురణములలోనివి గ్రంథము లనేకమున్నవి. అవి అన్నీకూడా ఇట్టివే. యూనివర్సిటీ పరీక్షలకు, స్కూలుఫైనలు పరీక్షకు పఠనీయములుగా నిర్ణయించే అధునాతనకవివిరచిత గ్రంథాలున్నూ ఇట్టివే. యూనివర్సిటీ కాంపోజిషన్ కమిటీవారు 1914-వ సం॥ రిపోర్టులో గ్రాంథికాంధ్రరచనకు ఆదర్శముగా పేర్కొని ప్రకటించిన గ్రంథాలలో ఒకటైనా నిర్దుష్టమైనది లేదు. ఒకటైనా నిర్దుష్టమైన గ్రాంథికాంధ్ర గ్రంథము మచ్చుకోసము పేర్కొని ప్రకటింపవలెనని జయంతి రామయ్య పంతులుగారిద్వారా ఆంధ్రసాహిత్య పరిషత్తువారిని కోరినాను; గాని నా కోరిక వ్యర్థమైనది.

సలక్షణమయిన గ్రాంథికాంధ్రభాషలోనే ఈ కాలమందు అనేకులు గ్రంథరచన చేస్తున్నారని రుజావుచేయుటకు పదేండ్లక్రిందట గ్రాంథికభాషావాదులు మహాజర్లలో ప్రకటించిన విషయములు వాస్తవము కాదని పై పేరాలో రుజావుచేసినాను. ఇకను, వ్యావహారికభాషలో గ్రంథములు పూర్వులు రచించి ఉండలేదనీ వ్యావహారిక భాష లక్షణవిరుద్ధమయినందున గ్రామ్యముగా దానిని పరిగణించి పూర్వులు బహిష్కరించినారనీ, అట్టి భాషలో నేడు గ్రంథములు రచించి బడులలో పిల్లలచేత చదివించుట సనాతన సత్సంప్రదాయమునకు కేవలము విరుద్ధమనీ, గ్రాంథికవాదులు ప్రకటించిన విషయముకూడా విమర్శించి అదికూడా అసత్యమని రుజావుచేస్తాను.

ASAFIA HYDER

వ్యావహారిక భాష నిష్ప్రయోజనమని మన పూర్వులు ఎన్నడూ తలంచలేదు. అది అపరిమితప్రయోజనమైనదని పూర్వపండితులు అంగీకరించినట్లు వారి గ్రంథములే ప్రమాణము. చూడండి:—

మన పూర్వులు మనవలెనే ఉత్తరప్రత్యుత్తరములు, క్రయపత్రములు, దానపత్రములు, ఒడంబడికలు మొదలయినవి వ్యావహారిక భాషలో వ్రాసే వారన్నందుకు ప్రాచీనులు తాటాకులమీద వ్రాసిన వ్రాతలు కనబడలేదు; గాని మన తాతలనాడు, ముత్తాతలనాడు, అంతకు రెండు మూడు తరములకు పూర్వమందున్ను వ్రాసిన తాటాకులున్నవి. (చూ. సాహిత్యపరిషత్పత్రిక 11 పుట 219, మధురనాయకుల దానపత్రములు). ప్రాచీనకాలమందు కూడా అట్టి ఆచార ముండేదని చెప్పుటకు తగిన ప్రమాణము శిలాశాసనము లందున్ను తామ్రశాసనములందున్ను కలదు. మహారాజాధిరాజులు తమ కున్ను తమ తల్లిదండ్రులకున్ను పుణ్యమూ కీర్తి వృద్ధియగుటకై దేవాలయ ములు, ప్రాకారములు, మండపములు, చెరువులు కట్టించి, ఈశ్వరారాధనా బ్రాహ్మణుల కర్మలూ నిరంతరాయముగా జరుగుటకొరకు అగ్రహారములు దానముచేసి తమ ధర్మములు ఆచంద్రార్కమూ చెల్లవలెనని శాసనములు చెక్కించి ప్రకటించినారు. కొందరు మహారాజులు వాణిజ్యవ్యాపార ములు అభివృద్ధిపొందుటకై స్వల్పసుంకములు నిర్ణయించి "అభయశాసన ములు" శిలాస్తంభములమీద చెక్కించినారు. రాజులవలెనే ప్రజలలో ధనవంతులు కొందరు కూడా చేసేవారు. ఈ శాసనముల రచన సనాతన సంప్రదాయసిద్ధమైనది. దాతలప్రశస్తి వంశవర్ణన తరుచుగా సంస్కృత మున, క్వాచిత్కముగా తెనుగున, చంపూకావ్యములో ఉన్నట్టు, గద్య పద్యాత్మకముగా ఉంటుంది. శాసనములోని ముఖ్యవిషయము వ్యావ హారిక భాషలో అందరికీ సుబోధముగా ఉండేటందుకు ప్రకటించుట మామూలు. దానముచేసిన గ్రామముల సరిహద్దులు నిరూపించినప్పుడు

వ్యావహారిక భాష తరుచుగా వాడేవారు. "అస్యగ్రామస్య సీమానో దిక్షు సర్వాసు చక్రమాత్, సర్వేషాం సుప్రబోధాయ లిఖ్యంతే దేశభాషయా" అని కారణముచెప్పి, తర్వాత ఎల్లలు వివరించేవారు. రాజరాజనరేంద్రుని నందంపూడి శాసనము భారతకర్త నన్నయే రచించినాడు. ఆ శాసనము లోని తెలుగుకున్ను భారతములోని తెలుగుకున్ను భేదమున్నట్లు స్పష్టముగా కనబడదు; గాని ఆపిమ్మట రెండుమూడు తరములు గడచినప్పటినుండిన్ని, శాసనములలోని తెలుగుకున్ను ప్రబంధములలోని తెలుగుకున్ను కాలమును దేశమునుబట్టి భేదము స్పష్టముగా నున్నది. ఇట్టి శాసనములు తెలుగుదేశ మందంతటా, అన్ని రాజ్యములలోను, క్రీ. శ. 12-వ శతాబ్దము మొదలు కొని 18-వ శతాబ్దివరకున్ను అపరిమితముగా ప్రకటితమై, పోయినవి పోగా, ఇప్పటికిన్ని వేలకొలదిగా రాతిపలకలమీదను, రాగి పట్టాలమీదను నిలిచి ఉన్నవి. వీటిలో నున్న దేశభాషాశబ్దములయందు ఇప్పటి పండితులు "గ్రామ్యములు"గా పరిగణించి దూషించేవి చాలా ఉన్నవి. "గ్రామ్య" సంజ్ఞ వ్యావహారికభాషకు పూర్వము లేదుగాబోలు. ఉంటే దానియందు అప్పుడు ఏమీ దోషములేదు గాబోలు. మన కాలమందు "పరులఁ దెగడు చోటఁ జెప్పనొప్పు" అని గ్రామ్యమునకు వ్రాతలో నింద ఒక్కటే ప్రయోజనముగా పండితులు నియమించుకొన్నారు. కాని పూర్వులు తమ వ్యావహారిక భాష ఆచంద్రార్కమును సుప్రతిష్ఠితములయి ఉండవలసిన ధర్మ శాసనముల రచనలో యోగ్యమైనదిగానే ఎన్నుకొన్నారు. శాసనములు రచించినవారు, (కొందరనుకొన్నట్లు) "గ్రాంథికాంధ్రము" తెలియనివారు కారు. శ్రీనాథకవిసార్వభౌముడు గ్రాంథికాంధ్రము ఎరుగనివాడు కాడు కదా. కొండవీటి రెడ్డిరాజుల ఆస్థానమందు విద్యాధికారిగా నుండి అతడు అనేక శాసనములు రచించినాడు. వాటిలో "అస్యగ్రామస్యసీమా చిహ్నాని దేశభాషయా లిఖ్యంతే" అని చెప్పి, వ్యావహారిక భాషలోనే

సరిహద్దులు వివరించి శాసనముకొసను "విద్యాధికారీ శ్రీనాథో వీర శ్రీ వేమభూపతేః, అకరోదాకరోవాచాం నిర్మలం ధర్మశాసనమ్" అని చెప్పుకొన్నాడు. ఇట్లే ఆముక్తమాల్యద రచించిన కృష్ణదేవరాయలు కోటాన కోట్లు వెలగల నవరత్నఖచితసువర్ణాభరణములు తిరుపతి వేంకటేశ్వర స్వామికి సమర్పించి, "దేశభాషను" అనగా ఇప్పటి పండితులు గ్రామ్యమని దూషించి బహిష్కరించిన వ్యావహారిక భాషను తన ధర్మశాసనము తానే స్వయముగా రచించిరో, లేక తన సమ్మతిని పండితులచేత రచియింపించిరో, తాటికాయలంతలేసి అక్షరాలతో దేవాలయము రాతిగోడల మీద కలకాలమూ ఆబాలగోపాలమూ అందరూ చదివి తెలుసుకొనేటట్టుగా చెక్కించి ప్రకటించినాడు. మనుచరిత్ర రచించిన అలసాని పెద్దనకూడా తాను చేసిన దానధర్మములు వ్యావహారిక భాషలో రచించిన శాసనములో ప్రకటించినాడు. శ్రీరంగమహాత్మ్యము, మాఘమహాత్మ్యము గ్రాంథిక భాషలో రచించి, కవి అని ప్రఖ్యాతిపొందిన దక్షిణ సింహాసనాధ్యక్షుడైన విజయరంగ చొక్కనాథ నాయనయ్యవారి ధర్మశాసనములుకూడా ఇట్టి భాషలోనే రచితమయినవి. ఇది అన్నిదేశములందున్ను సనాతనమైన శిష్టాచారము. అశోకుని ధర్మశాసనములన్నీ వ్యవహారమందున్న పాళీభాషలో ప్రకటితమయినవి. 1802 సం|| మొదలుకొని నేటివరకు ఇంగ్లీషుప్రభుత్వమువారు తమ శాసనములన్నీ వ్యావహారిక భాషలోనే ప్రకటిస్తున్నారు. ఇది సంప్రదాయ విరుద్ధముకాదు.

ఇందుకు దాఖలాగా వేరువేరు ప్రదేశములందు వేరువేరు కాలములలో వేరువేరు ధర్మకార్యములు ప్రకటించుటకు రచితమైన శాసనములు, వివరించకుండా కొన్ని సూచించి పేర్కొంటే చాలు ననుకొంటాను. విమర్శింప నుద్దేశముకలవారు నేను సూచించిన గ్రంథములలో శాసనములు పూర్తిగా చదివి చూడవచ్చును. ఈ దిగువనున్న పట్టీలో "ఎపి" అంటే

ఎపిగ్రాఫియా ఇండికా సంపుటములు. "ఎపి. ఇండో-మోస్ల" అంటే ఎపిగ్రాఫియా ఇండోమోస్లామికా. "సా. ప" అంటే సాహిత్య పరిషత్పత్రిక. "నెల్లూ" అంటే బటర్వర్తు వేణుగోపాల చెట్టిగార్ల నెల్లూరుజిల్లా శాసనములు. "లోకల్" అంటే గవర్నమెంటువారి ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమందున్న లోకల్ రికార్డు. "శృంగా" అంటే వేటూరి ప్రభాకర శాస్త్రిగారు రచించిన శృంగార శ్రీనాథమునకు అనుబంధము. "హైద" అంటే హైదరాబాద్ ఆర్కెయొలాజికల్ సంపుటములు. "త్రిలిం" అంటే వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారి త్రిలిఙ్గపత్రిక. శాసనకాలము శక సంవత్సరములని తెలియవలెను. ప్రతి శాసనములోనుండిన్ని 'గ్రామ్య' శబ్దములకు ఉదాహరణముగా ఒకటి రెండు మాటలు ఎత్తిచూపిస్తాను.

1. ఎపి. IV, 1108. పిఠాపురం. కులోత్తుంగ మన్మగొంకరాజుల మహాదేవులు; ఉ. అఖండమున్ను, ఉత్సవార్ధమున్ను.
2. హైద. III. 1157. ఓరుగంటిదరి ఉపర్పల్లి. కాకతి గణపతిదేవని ప్రధాని. ఉ. వనమూను, సర్వమూను.
3. ఎపి. XII. 1166. మోటుపల్లి కాకతి గణపతిదేవని అభయశాసనము. ఉ. ఎల్లవారికిన్ని, ముత్యాలకూ.
4. త్రిలి. III. 40. 1231. నందలూరు. కాకతి ప్రతాపరుద్రదేవ మహారాజు. ఉ. ఇస్తిమి.
5. ఎపి. IV. 1259. దోనెంపూడి. ఆంధ్రఖండ మండలాధిపతి నామనాయకుడు. ఉ. పెట్టింది.
6. ఎపి. IV. 1313. పిఠాపురం. కాటమరెడ్డింగారు. ఉ. రెడ్డింగారికిన్ని.
7. లోకల్. శృంగా. 1330. కొమరగిరి. ముక్కంటిరాజు. ఉ. రాజుగారికిన్ని.
8. డిటో. 1330. పొన్నుపల్లి. వేమారెడ్డింగారు. ఉ. వచ్చేవాఁగున్ను.

9. ఎపి. IV. 1336. దాక్షారామం. వేమారెడ్డిగారి భృత్యుడు. ఉ. దేవులకున్ను.

10. లోకల్. శృంగా. 1336. కల్వపాములు. వేమారెడ్డింగారు. ఉ. ఇట్టిక నూయిన్ని.

11. డిటో. 1336. పొన్నుపల్లి. డిటో. ఉ. రెండున్ను.

12. ఎపి. IV. 1350. తక్కెళ్ళపాడు. రెండవ దేవరాయలు. ఉ. సంధుకు

13. ఎపి. XIII. 1356. వేమవరం. అల్లయ వేమారెడ్డింగారు. ఉ. పాద లున్ను.

14. త్రిలి. III. 40. 1423. నందలూరు. సాళువ నరసింగరాయల సేనాపతి ఉ. చేస్తుండే.

15. సా. ప. (ఆనంద) 1434. తిరుపతి. కృష్ణదేవరాయలు. ఉ. యింత వట్టున్ను.

16. కవిజీవితములు. 1.440. కోటకాగ్రహారం. అల్లసాని పెద్దన. ఉ. ఇస్తిమి.

17. డిటో. 1.441. సింహాచలం. కృష్ణదేవరాయలు. ఉ. నడిచేటందుకు, కూడా, పోతారు.

18. త్రిలి. III. 40. 1541. నందలూరు. సదాశివరాయలు. ఉ. నలభైఒకటి.

19. ఎపి. ఇండో. మోస్లా. 1587. గోల్కొండ. సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్ శాహి. పుచ్చుకొంటున్నాను, చాలా.

20. ఎపి. XVI. 1630. తిరిచినాపల్లి. విజయరంగ చొక్కనాథ నాయనిం గారు. ఉ. వుండేటందున, చేసుకొను.

21. నెల్లూ. పు. 436. 1713. ముత్యాలపాడు. కలిగిరి సుందరయ్య. ఉ. నడిపిస్తూ, రెండో.

వ్యావహారిక భాషాప్రయోజనములలో శిష్టసంప్రదాయసిద్ధమైనది ఒకటి వ్రాతలయందు కూడా తెలుగుదేశమంతటా 700 సంవత్సరములు శిలాక్షరమై ఉన్నట్టు రుజావుచేసినానుగదా. ఈ భాష సంభాషణయందే కాని వ్రాతలయందు పూర్వులు వాడలేదని వాదించినవారి మాట అసత్య మనుటకు ఈ ఒక్క ప్రమాణమే చాలును. అయితే ఈ భాష అపరిమిత ప్రయోజనమని నేను రుజావుపర్చుటకు ప్రతిజ్ఞచేసి ఉన్నాను. కనుక మరి కొన్ని ప్రయోజనములు సప్రమాణముగా వివరించి చెప్పవలెను.

ఆబాలగోపాలము తెలుగువారందరికీ పాడుటకూ వినుటకూ ఆసక్తి పుట్టించే పాటలు, పదాలు, కీర్తనలు మొదలయినవి వేలకొలదిగా ఉన్నవి. కొన్నిటిలో భక్తి, కొన్నిటిలో శృంగారము, కొన్నిటిలో జ్ఞానము, కొన్నిటిలో హాస్యము; ఇట్లే కరుణ, శోకము మొదలైన రసములు. అన్నీ వీటిలో వ్యక్తపడుతున్నవి. ఇవి వ్యావహారిక భాషలోనే సనాతనసత్సంప్రదాయానుసారముగా పూర్వకవులు రచించేవారని తాటాకుమీద వ్రాసి ఉన్న ఈ పాటల పుస్తకాలు చూస్తే తెలుస్తుంది. ఇట్టి పుస్తకాలు దేశమందంతటా ఉన్నవి. తంజావూరి సరస్వతీ మహాలులో, చెన్నపట్టణము గవర్నమెంటు ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమందు, ఆంధ్రసాహిత్య పరిషత్పుస్తక భాండాగారమందు చాలా గ్రంథములున్నవి. ఈ పాటలకు "కావ్య" నామము చెల్లదా? సంస్కృతమందు జయదేవుడు రచించిన గీతగోవిందమువంటివి కావా భరతశాస్త్ర ప్రవీణులయినవారు తిరుపతిలోని తాళ్ళపాకవారు, తంజావూరిలోని త్యాగరాయలు, మన్నారుగుడిలోని సభాపతయ్యగారు, క్షేత్రయగారు మొదలయినవారు రచించిన తెలుగు కీర్తనలు? ఈ కవులు, పండితులు కారనగలరా? విద్వత్కవులు వ్యావహారిక భాషలో ధర్మశాసనములు రచించినట్టే, ఆ భాషలో పాటలూ పదాలూ కూడా రచించినారు. తాళ్ళపాకవారు సంస్కృతమున, ప్రాచీనాంధ్రమున

అనేక కావ్యములు రచించినవారే కదా. నిరంకుశోపాఖ్యానము రచించిన రుద్రకవి సుగ్రీవవిజయమనే యక్షగానముకూడా రచించినాడు. అందు "త్రిపుటలు, ఏలలు, ద్విపదలు, అర్ధచంద్రికలు, జంపెలు మొదలగు రాగ తాళజ్ఞానమునం జదువవలసిన భాగ మెక్కుడుగా నున్నది" అని సా. ప. పత్రిక VIII సంపుటములో విమర్శకులు చెప్పినారు. ఇవి అన్నీ వ్యావహారిక భాషలో ఉన్నవి. ఉత్తర రామాయణము రచించిన ధరణిదేవుల రామమంత్రి విష్ణుమాయావిలాసమనే యక్షగానము ఇట్లే రచించినాడు. అప్పకవి రచించిన యక్షగానము దొరకలేదు గాని. అదిన్నీ ఇట్లే రచితమై ఉండునని ఊహించవచ్చును. పూర్వకవుల సంప్రదాయమును అనుసరించి మన తాతలనాటి మృత్యుంజయవిలాసము, రామదాసుకీర్తనలు, తూము నరసింహదాసు కీర్తనలు, నిట్టల ప్రకాశదాసు కీర్తనలు, కృష్ణమాచార్య కీర్తనలు మొదలయినవి తెలుగుదేశమందు నెలకొనియున్నవి. ఇవికాక, స్త్రీల పాటలు, పెద్దవీ చిన్నవీ, నవరసభరితమైనవి వేలకొలదిగా ఉన్నవి. పామర జనులు పాడేవి వాస్తవమైన గ్రామ్యభాషలో నుండుట ఉచితమే కదా; అట్టివి శిష్టులుకూడా పామరులకోసము నానావిధములా రచించినారు. సోహంభావతత్వములు పామరులకోసము పాటగా ఉన్నవి. భక్తిబోధకముగా సువ్విపాట ఒకరు రచించినారు. ఇట్లే స్తోత్రములు, విన్నపములు, అష్టకములు, చూర్ణికలు, రగడలు, దండకములు, ద్విపదలు పాడుటకు అనుకూలముగా భక్తులు రచించినవి అపరిమితముగా ఉన్నవి. వీటిలోని భాష శిష్టవ్యవహారమందున్నదే కాని కేవల గ్రంథస్థమైనది కాదు. వడ్డాది సుబ్బారాయుడు పంతులుగారివంటి నేటి కవులు వ్యావహారిక భాష పాటలలో సయితము వాడకూడదని బహిష్కరించి, గ్రాంథిక భాషలో పాటలు రచించినారు. గ్రామ్యభాషలో పాతపాటలు పాడినవారందరూ నరకములో

పడిపోయినారు గాబోలు ! గ్రాంథికభాషలో పాడితేనేకాని మోక్షము దొరకదు కాబోలు?

పూర్వకవుల సంప్రదాయమును అనుసరించి సంకీర్తన లక్షణము నిరూపించిన తాళ్ళపాక అన్నయాచార్యులు భక్తుల కీర్తనలు ఎటువంటివని చెప్పినాడో చూడండి:—

"మ. శ్రుతులై శాస్త్రములై పురాణ కథలై సుజ్ఞానసారంబులై,
యతిలోకాగమవీధులై వివిధ మంత్రార్థంబులై నీతులై,
కృతులై వేంకటశైలవల్లభరతి క్రీడా రహస్యంబులై
నుతులై తాళులపాక యన్నయవచోనూత్నక్రియల్ చెన్నగున్."

పదరచనలో గ్రామ్యోక్తులు బహిష్కరించలేదు సరేకదా అవి ఎట్లు ప్రయోగించవలెనో విశేషించి విధించినాడు. ఇక్కడ గ్రామ్యోక్తులు అనగా పామరజనుల మాటలు అని అర్థము స్పష్టము.

"క. పదముల శృంగార వధూ
మృదుమధుర మనోజ్ఞ వాక్యమిశ్రములైనన్
విదితార్థ గ్రామ్యోక్తులు,
పదిలముగాఁ బొంక మెఱిఁగి పలుకం జెల్లున్."

క. పురుషోక్తి సంస్కృతంబును
దరుణీవాక్యమునఁ బ్రాకృతము నీచ వధూ
పరిభాష నితర భాషలు
పరగినక్రియ నుచితభాష పదములఁ జెల్లున్.

క. పల్లవ నాకీమ్లేచ్ఛా
ద్యుల్లాసమనోజ్ఞ బంధురోక్తులు చవిరై
చెల్లును గ్రామ్యములైనను
మాల్లీనక ముఖ్యనాటకాదిక ఫణితిన్.

క. జగతిగల చెల్లుబల్లై
నగినగి భాషించునట్టి నానుడిపలుకుల్
తగదన రహించెడుఁ బువ్వుల
సాగ నుడుగం బిసికి కంపు చూచిన భంగిన్.

ఇప్పుడుకూడా సామాన్య జనులు పాడే దరువులు, జక్కులరేకులు, ఏలలు, గొబ్బిళ్లు, చందమామపదములు మొదలయినవాటికి లక్షణము నిరూపించినాడు. అందరూ ఎరిగిఉన్న పాటలలోని వ్యావహారికభాషకు ఉదాహరణములు అట్టే అక్కరలేదు. "ఉపచారము చేసేవారున్నారని మరవకురా," "ఉండేది రాముడొకడు," "చెడేబుద్ధి మానురా," "ఎవరని నిర్ణయించేదిరా," "రాజు వెడలె జూతాము రారె," "చింతిస్తున్నాడే యముడు," "ఇంకా దయరాకుంటే ఎంతని సైరింతునురా" ఇట్లు భజనజేసే విధము తెలిసిన రామభక్తుడు త్యాగరాయలు తన కీర్తనలు రచించినారు. ఐదవ సంవత్సరాది సంచికలో హరినాగభూషణముగారు రచించిన శ్రీమత్ త్యాగరాజచరిత్రము చదివితే తెలుస్తుంది త్యాగరాయలు ఎట్టివారో. వీరి భాష భజనపరుల కందరికిన్నీ ప్రియమైనది. వాస్తవమైన గ్రామ్యభాషలో శిష్టసంసర్గము లేని పామరులకోసము వేరే పాటలు రచితమై అనేకము లోకమందున్నవి. వాటిలోని గ్రామ్యము శిష్టుల వ్యవహారమందుండదు. అట్టి గ్రామ్యము, హాస్యానికై తేనే తప్ప, శిష్టులు పాడితే అసహ్యముగా ఉంటుంది. శిష్టులు పాడే పాటలలో శిష్టవ్యవహారసిద్ధమైన మాటలే ఉంటవని నమ్మవలెను.

ఇట్టి పాటలపుస్తకాలు గవర్నమెంటువారి లిఖితపుస్తకభాండాగారమందున్నవి. కొన్ని పేర్లుగాని చెప్పతాను: మృత్యుంజయవిలాసము, రుక్మాంగదచరిత్ర, కృష్ణమాచార్యకీర్తనలు, ముద్దుపలని సప్తపదులు, రుక్మిణీగోపాలసంవాదము, లక్ష్మణమూర్ఛ, తారాశశాంకము, సోహం

భావతత్త్వములు, గోపీగోపాల సంవాదము, దశరాపద్యాలు, రామదాసు కీర్తనలు, సిరియాళు చరిత్రము, వేదాంతకీర్తనలు, పారిజాతప్రబంధము, సువ్విపాట, జీవైక్యబోధము, మాధవాష్టకము, వేంకటేశ్వరాష్టకము, రఘురామాష్టకము, రాఘవాష్టకము, కడపాధినాయకాష్టకము, కోనేటి రాయాష్టకము, నవనీతచోరాష్టకము, దాక్షారామభీమేశ్వరాష్టకము. ఆంధ్రసాహిత్యపరిషత్పుస్తక భాండాగారమందున్నవి:— అధ్యాత్మరామాయణ కీర్తనలు, ఒప్పగింతపాటలు, కీర్తనలు, కృష్ణకీర్తనలు, రామకీర్తనలు, గొల్లభామపదము, గొల్లకలాపము, జ్ఞానగురుస్తోత్ర కీర్తనలు, తలుపులవద్ద పాటలు, పిళ్ళారప్ప పదములు, మువ్వగోపాలపదములు, రామాయణ పదము, వెంకటేశ్వరకీర్తనలు, వేదాంతకీర్తనలు, వేదాంతపదము, వేదాంతముపాట, శారదారామాయణము, శివకీర్తనలు, శృంగారపు పాటలు, శ్రీశైల శివకీర్తనలు, క్షేత్రయపదములు, రామదాసుచరిత్ర, రామప్రభో, అనే పాటలు, వారణాసి బ్రహ్మయ్య పదములు. శైలి ననుసరించి రగడలలోను దండకములలోను వ్యావహారిక భాష, కొలదిగానో అధికముగానో, ఉంటుంది. భారతము, భాగవతము, రామాయణము మొదలైన ఇతిహాస పురాణములలోని కథలే కాక, పల్నాటి వీరచరిత్రము, బొబ్బిలియుద్ధము, భక్తుల కథలు, దేవతలమహిమలు పెద్ద పదములుగా పూర్వకవులు ద్విపదలు రచించి ప్రజలకు ప్రసాదించినారు. పరిషత్తువారి బహిష్కరణము ఆంధ్రమహాజనులు అంగీకరించి ఈ పాటలన్నీ గ్రాంథికభాషలోనికి మార్చివేస్తే, లోకానికి ఉపకారమా అపకారమా ఆలోచించుకోండి. తెలుగువారు, స్త్రీలు, పురుషులు, పెద్దలు, పిన్నలు, పండితులు, పామరులు తాటాకులమీద వ్రాసుకొనికానీ, వ్రాయించుకొనికానీ, చదువుకొనికానీ, చదివించుకొనికానీ, ఈలాటి పాటలవల్ల చతుర్విధపురుషార్థములు సాధించేవారని చెప్పుట, అతిశయోక్తి కానేరదు. గ్రాంథికభాషలో రచించిన

గ్రంథములు పండితులకు మాత్రమే ఉపయోగించును; ఇవి అఖిల లోకోప కారకములు కావు. ఇట్టివి అందరికోసము వ్యావహారికభాషలో రచించుట సత్సంప్రదాయమని దాని ప్రాచుర్యమునుబట్టి సిద్ధాంతము కాదా?

తెలుగువారు నాగరికులు. నూటికి తొంభైమందికి ఓనమాలు రాక పోయినా పెద్దల ధర్మాన పాటలూ, పదాలూ విని, పండితులకు తెలిసిన విషయములు అనేకము నేర్చుకొని, తెలివితేటలు గలిగి ఉన్నారు. వారి రుచులకు తగినట్టి నాటకములుకూడా పూర్వికవులు రచించేవారు. క్రీ. శ. 17-వ, 18-వ శతాబ్దులలో తంజావూరు రాజధానిగా చోళమండలమును పరిపాలించిన తెలుగురాజులూ మహారాష్ట్రరాజులూ సారస్వతమందు చాలా అభిమానము గలవారు. తెలుగురాజులలో కొందరు ప్రఖ్యాత పాండిత్యము సంపాదించి కావ్యములు రచించినారు. వారుంచుకొన్న వేశ్యలు కొందరు విదుషీమణులు; సంగీతసాహిత్య ప్రవీణలు. వారి ఆస్థానమందు అన్ని భాషలూ, అన్ని శాస్త్రములూ, అన్ని కళలూ అభ్యసించి ఆరితేరిన పండితు లుండేవారు. ఈ ఆంధ్రమహారాష్ట్రరాజుల కాలమందు రాజులున్ను వారి పండితులున్ను వారి వేశ్యలున్ను రచించిన నాటకములు అనేకము ఇప్పటికిన్నీ అచ్చట సరస్వతీమహాలులో ఉన్నవి. తెలుగున, అరవమున, కన్నడమున, మహారాష్ట్రమున, హిందీని, సంస్కృతమున ఇవి రచితమైనవి. 1918-వ సంవత్సరమున అచ్చట భారతప్రతులు చూచుటకు వెళ్ళి ఆరువారములుంటిని. ఉద్దేశించిన పనికే కాలము చాలనందున సుమారు ఇరవై నాటకములు అక్కడక్కడ చదివి చూచి, మరి యాభై నాటకముల పేళ్ళుమాత్రము వ్రాసికొన్నాను. విజయరాఘవనాయనింగారు, రంగాజమ్మగారు, కోనేటి దీక్షితులు మొదలయిన కొందరి రచన విశిష్టముగా ఉన్నది. దానిలో వ్యావహారికభాష పాత్రోచితముగా ఆ కాలమందు తంజావూరిలోని వాడుకను అనుసరించి ఉన్నట్టు కనబడినది. అనేక నాటకములలో వచనములు

మాదిరివే పద్యాలూ, పాటలూ వాడుక మాటలతో రచితమయి ఉన్నవి. ఉదాహరణార్థము రఘునాథనాయనింగారి కొమాళ్ళు విజయరాఘవ నాయనింగారు (గొప్ప పండితుడు) రచించిన రఘునాథాభ్యుదయ నాటకము లోని "రాజ్యం జమాకర్చు అట్టవణరంగయ లెక్క వినిపించిన విధం" శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రకటించిన "తంజావూరి యాంధ్రరాజుల చరిత్ర" పీఠిక 32-వ పుటలో చూడవచ్చును. శాహజీమహారాజు రచించిన పార్వతీపరిణయ నాటకములోనివి ఒకటి రెండు వాక్యాలుమాత్రము మచ్చుకు ఇక్కడ వ్రాస్తాను.

సూత్రధారవచనం—యవరోయి భాగవతుల్లారా! విఘ్నేశ్వరుండు వచ్చినాండే పూజసేసేటందుకు పూజారివాణ్ణి పిలవవోయి.

పూజారివచనం—నేనైతే వచ్చినాను. పరిచారకుణ్ణి పిలిపించండా.

పారిజాతాపహరణములోని సీసపాదం—"పలుమారు నాకొంగు బట్టే వదేమిరా, మాయత్త వింటేను మాటవచ్చు."

ఆంధ్రభాషాసారస్వతముల పరిణామము నిరూపించుటకు ఈ నాటకములు ఆవశ్యకమయినవని వేరే చెప్పనక్కరలేదు.

కథలు ప్రతి దేశమందున్నూ ఆబాలగోపాలం అందరికీ ప్రియమైన సారస్వతముగా ఉన్నవి. పాటలవలెనే ఇవన్ని జనులు నిరక్షరులై ఉన్న కాలమందే పుట్టినవి. వ్రాత నేర్చినతర్వాత జనులు ఈ కథలు వ్రాసుకొని తాము చదువుకొంటూ, ఇతరులకు చదివి వినిపించేవారు. సర్వజనసామాన్యముగా ఉన్న భాషలోనే వ్రాతయందుకూడా ఈ కథలు కనబడుతున్నవి. మనదేశమందు కూడా ఇట్లు రచించిన కథలపుస్తకాల వ్రాతప్రతులు అనేకమున్నవి. ఈ కథలు అచ్చువేయించేవారు వ్రాతప్రతులలో ఉన్నట్లే గ్రంథముంచవలెను; లేదా, పూర్వకాలపు భాష దుర్బోధముగా ఉంటే తమ కాలపు భాషలో ఉన్నట్టు సవరించి సుబోధముగా చేయవలెను; గాని,

లోకులకు అపరిచితమయిన భాషలోనికి మార్చడము యుక్తమా? ఇట్టి దురాచారము మరేదేశమందున్నూ లేదు. గ్రాంథికభాషలోనే పూర్వులుకూడా కథలు రచించేవారని తోచునట్లుగా ఇప్పటి అచ్చుపుస్తకాలు దుష్టపరిష్కర్తల కూటకరణమువల్ల మారురూపము పొందినవి. వాడుకభాషలోని కథలు పిల్లల స్వంతసారస్వతము; పామరులస్వత్వము, సర్వజనసామాన్య సంపత్తి, వాడుకలోలేని భాషలోనికి వీటిని మార్చడము మహాపాతకము. ఇట్టి పాపకృత్యము పూర్వపండితులు ఎన్నడూ తలపెట్టలేదు. అచ్చు యంత్రములో మొట్టమొదట అచ్చుపడ్డ తెలుగుపుస్తకములు చూచినవారికి నిజము తెలుస్తుంది. ద్వాత్రింశత్సాలభంజికకథలు 1819-వ సం.న, పంచతంత్రకథలు 1834-వ సం.న చెన్నపట్టణ పాఠశాలలో అప్పుడు తెలుగు పండితుడుగా ఉండిన రావిపాటి గురుమూర్తిశాస్త్రిగారు వ్యావహారిక భాషలో రచించి అచ్చువేయించినారు. ఆయన తెలుగువ్యాకరణము, శేషయ్యగారి తెలుగువ్యాకరణమువంటి గ్రంథములుకూడా అట్టి భాషలోనే రచితమై ఉన్నందున ఆ కాలమందు అట్టి రచన సత్సంప్రదాయానుసారమయినదని ఊహించవలెను. చిత్రకథలు, నీతికథలు (1856), నారాయణసామిగారి తెలుగు కథలు (1839), పరమానందయకథలు (1861) మొదలయినవి అట్లే వాడుకభాషలోనే అచ్చుపడ్డవి. అంతకు పూర్వముకూడా ఇట్లు కథలు రచించుట శిష్టాచారముగా ఉండేదా అని విచారించగా, ఆంధ్రసాహిత్యపరిషత్పుస్తకభాండాగారమందు వ్యావహారికభాషలో రచితమయినకథలు తాటాకుపుస్తకాలలో చాలా కనబడ్డవి. ఉదా: చిలుక చెప్పినకథలు, హంసవింశతి, ద్వాత్రింశత్సాలభంజికలకథలు, పంచతంత్రకథలు, తెనాలిరాముడికథలు మొదలయినవే కాక, రామాయణము, భాగవతము, భారతము మొదలయినపురాణేతిహాసములుకూడా ఇట్టిభాషనే వచనములూ కథలుగా రచితమయినవి ఉన్నవి. "రామాయణార్థంబు అంధ్రులకీ

తెలియడానికి వచనరూపంబుగా మార్కండేయమహాముని పాండునందనులకు చెప్పినప్రకారం సింగరాజుదత్తాత్రేయులు చేసుకొన్న పుణ్యకథ సంపూర్ణం". అని గ్రంథకర్త గ్రంథాంతమందు ఏ ఉద్దేశముతో ఇట్లు రచించినాడో స్పష్టముగా తెలియజేసినాడు. ఇట్లు రచించినరాజులచరిత్రలు భక్తులచరిత్రలు కూడాకలవు. సాహిత్యపరిషత్తువారివద్దనున్న రాయవాచకము, ప్రతాపచరిత్రము, కర్ణాటకరాజ్య వృత్తాంతము వ్రాతప్రతులలో ఉన్నట్టే అచ్చుపడ్డవి. గవర్నమెంటువారి లిఖితపుస్తకభాండాగారమందు తంజావూరిరాజులచరిత్ర, సింహాళవిజయము, భాగవతచరిత్ర ఉన్నవి; మొదటిది శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తాము రచించిన పీఠికతో అచ్చు వేయించినారు. తెలుగుదేశముచరిత్ర విశదపర్చగల వృత్తాంతములు, అపరిమితముగా మెకన్జీ, టెయిలర్, బ్రౌన్ మొదలయినవారు సంపాదించినవి కుప్పలుకుప్పలుగా గవర్నమెంటువారి పుస్తకభాండాగారమందు "లోకల్ రికార్డు" అనే పేరితో ఉన్నవి. ఆంధ్రపత్రిక 149-వ సంచికలో 25-1-24-వ తేదీని "ఓరియంటల్ లైబ్రరీ" అనేశిర్షికతో క. మార్కండేయశర్మగారు ప్రకటించినవ్యాసము చూస్తే, ఇవి ఎంతవిలువయినవో తెలుస్తుంది.

వచనరచనాసంప్రదాయము పూర్వ మిట్లుండేదని గ్రామ్యగ్రాంథికవాదము విమర్శించి తీర్పుచెప్పిన పరిషత్పండితులకు గాని యూనివర్సిటీ పండితులకుగాని శాసననిర్మాణసభలోని తెలుగుసభికులకుగాని విద్యాశాఖాధ్యక్షులకుగాని 1914 సం. రమునకు పూర్వము తెలియలేదు. ఇట్టివచనగ్రంథములు వందలకొలదిగా వ్రాతప్రతులలో ఉన్నవని నేనైనా మొదట ఎరుగను; లోకములో నేటికిన్నీ ఈ సంగతి తెలిసినవారరుదు. అయితే, ఇట్టివచనగ్రంథములతో పాటు, పాండ్యచోళమండలములలో ఆంధ్రరాజుల ప్రభుత్వము సాగుచుండినప్పుడం "గ్రాంథికాంధ్రము"న వచనముగా రచించిన

జైమినిభారతము, శ్రీరంగమహాత్మ్యము, భారతము మొదలయినకొన్ని గ్రంథములకు వ్రాతప్రతులు సాహిత్యపరిషత్తువారికి దొరికినవి. అందులో జైమినిభారతముమాత్రము పరిషత్తువారే, భాషలో కూడనిమార్పులు కొన్ని చేసి, అచ్చువేయించినారు. ఈప్రౌఢవచనములలోకూడా "వాటిని, "వాటికి", "రెండో అధ్యాయము", ఉండే", "చేస్తివి", 'కూతురిని' 'పిలిచినా' 'దాంకా', 'రాజుకు', 'ఇరువై' మొదలయిన వాడుకమాటలు అనేకముగా ఉన్నవి. ఇట్టివి దిద్దడము లోకాన్ని మోసపుచ్చడము కాదా? ఇవి రచించినవారు ప్రాచీనాంధ్రభాష శ్రద్ధగా అభ్యసించి, ఆభాషలో తమకుగల రచనాసామర్థ్యము ప్రకటించి పండితులమెప్పు పొందగోరినవారు. వాడుక భాషలో తాము రచించిన వచనగ్రంథములవలె ఇవి అఖిలలోకోపకారక మైనవి కావని వా రెరుగుదురు.

లోకులందరికీ ఉపయోగించేటందుకు రచించినపుస్తకములన్నీ వాడుక భాషలోనే ఉన్నవని ఋజువుచేయుటకు చాలినంతసాక్ష్యము లిఖితపుస్తక భాండాగారములందే ఉన్నదిగదా! ఇంతవరకు, శాసనములు, పాటలు, యక్షగానములు, నాటకములు, కథలు, పురాణేతిహాసములు, చరిత్రలు వ్యావహారికభాషలో మనపూర్వులు రచించినవే అనేక మున్నవని నిస్సంశయముగా ఋజువయినది గదా! ఇకను, శాస్త్రములు, కళలు అభ్యసించే తెలుగువిద్యార్థులకు గురువులు ఎట్టిభాషలో గ్రంథములు రచించేవారో తెలియజేస్తాను. అన్నివిద్యలలోనూ "ఆధ్యాత్మవిద్యావిద్యానాం వాదః ప్రవదతా మహమ్" అని శ్రీకృష్ణభగవానులు చెప్పినట్లు, ఆధ్యాత్మవిద్య శ్రేష్ఠమయినది గదా. ఈవిద్యను తెలుగువారికి వాడుకమాటలతో బోధిస్తూ పండితులు, యతులు మొదలయిన జ్ఞాన సంపన్నులు రచించిన వచనగ్రంథములు వందలున్నవి. ఉదా: పరిషత్తువారివద్ద నున్నవి కొన్నిటిని పేర్కొంటాను. మోక్షశాస్త్రము, భగవద్గీతావచనము, వాసుదేవమననము, వేదాంత

వార్తికలు, మహావాక్యలక్షణము, వేదాంతవచనము, పారలపంచకము, సకలోపనిషత్సారసంగ్రహము, సాత్వికబ్రహ్మవిద్యావిలాసము. గవర్నమెంటువారి పుస్తకభాండాగారమందు అజ్ఞానధ్వాంతచండభాస్కరము, వేదాంతసారసంగ్రహము, అర్చిరాదిమార్గము, తత్వము, రాజయోగప్రకాశిక మొదలయినవికూడా ఉన్నవి. సంస్కృతమందున్న వేదాంతగ్రంథములు చదువగోరే తెలుగువారి కోసము వాడుకమాటలతోనే గురువులు వాటికి టీకలు రచించినారు. భగవద్గీతలకు ఆనందతీర్థులువారు, పరమానందయతీంద్రులు, తాళ్లపాక తిరుమలయ్యంగారు రచించినటీకలున్ను. ఉత్తరగీతలకు పరమానంద తీర్థులవారు సుదర్శనతీర్థులవారు రచించినటీకలున్ను, మహిమ్నస్తవటీక, ప్రౌఢానుభూతివ్యాఖ్య, పంచీకరణము మొదలయినవిన్నీ, గవర్నమెంటువారి పుస్తకములలో కనబడుతున్నవి. పూర్వసంప్రదాయము ననుసరించే శ్రీ వేంకటగిరిమహారాజా శ్రీ వెలుగోటి సర్వజ్ఞకుమారయాచేంద్ర భూపతులు నాస్తికధ్వాంతభాస్కరము, మనస్సాక్ష్యము మొదలయిన అనేక తత్వగ్రంథములు ("గ్రామ్య" భాషలోనే అందరికి తెలిసేటట్టు రచించుట యుక్తమని సిద్ధాంతీకరించి) రచించి ప్రకటించినారు. వీరి పాండిత్యము జగద్విఖ్యాతము. వీరు గ్రాంథికాంధ్రము రానివారు కారే! తక్కినశాస్త్రములలో తెలుగుదేశమందు బాగా వ్యాపించి ఉన్నవి జ్యోతిషమున్ను, వైద్యమున్ను. వీటిని తెలుగువారు అభ్యసించుటకుగాను సంస్కృత గ్రంథములకు వాడుకమాటలలోనే టీకలు రచించి గురువులు శిష్యుల కిచ్చినారు. జ్యోతిషమందు గవర్నమెంటువారి వ్రాతపుస్తకములలో బృహజ్జాతకటీక, భీమకవి జోస్యము, ప్రతిభాగవివరణము, ప్రశ్నశాస్త్రము, గోపాలరత్నాకరము మొదలయినవిన్నీ గణితశాస్త్రములు కొన్నిన్నీ ఉన్నవి. సూర్యసిద్ధాంతము, తిథిచక్రము, అష్టకవర్గ శ్రీపతిజాతకపద్ధతి విశాఖపట్టణమందు చూచినాను. వైద్యమందు వైద్యశాస్త్రము, యోగసంగ్రహము

సుశ్రుతసంహితటీక, వైద్యచింతామణి, రసార్ణవము గవర్నమెంటు పుస్తకాలలో ఉన్నవి. పరిషత్తువారివద్దను కూడా వీటిలో కొన్ని ప్రతులున్నవి. చెన్నపురి ఆయుర్వేదకళాశాలలో అనేకగ్రంథము లిట్టివి ఉన్నవి. ఇప్పుడు కూడా జ్యౌతిషికులు, వైద్యులు వాడుకభాషలోనే శాస్త్రచర్చ చేస్తారు. శ్రీపిడుపర్తి సుబ్రహ్మణ్యసిద్ధాంతిగారు రచించిన "జ్యోతిశ్శాస్త్రసమ్మేళనము" గ్రంథాలయసర్వస్వము (5) లో ప్రకటితమయి ఉన్నది. దాని నిండా కావలసినంతవాడుకభాష ఉన్నది. వైద్యచంద్రిక మొదలయిన పత్రికలలోని వ్యాసములందు వాడుకమాటలు తరుచుగా కనబడుతూఉంటవి. గణితశాస్త్రము, ధర్మశాస్త్రము, వాస్తుశాస్త్రము, శిల్పశాస్త్రము, విశ్వవిద్యాభరణము, సాముద్రికశాస్త్రము, మృగయా, (వేట) ధనుశ్శాస్త్రము, మొదలయినవాటియందుకూడా తెలుగుటీకలతోనే తెలుగువారు పూర్వము చదువుకొన్నగ్రంథాలు కొన్నిఉన్నవి.

సంస్కృతమున, ప్రాచీనాంధ్ర భాషను, ప్రాచీనులు రచించిన ఉత్తమగ్రంథములు తెలుగువారు తెలుసుకొనేటందుకు వాటికి వాడుకభాషలోనే టీకలున్ను, అమరము మొదలయినసంస్కృతనిఘంటువులకు, వాడుకమాటలతోనే అర్థాలున్ను, గొప్పపండితులు మున్నూరేండ్లకు పూర్వమే వ్రాసిపెట్టినారు. ఈప్రాచీనసంప్రదాయము చొప్పున మనతాతముత్తాతలకాలమందున్ను, ప్రబంధనిర్మాతలయిన విద్వత్కవులుకూడా టీకలురచించినప్పుడు వ్యావహారికభాషే వాడినారు. నామలింగానుశాసనమను ప్రఖ్యాతపండితుడు నాగదేవభట్టోపాధ్యాయుడు తెలుగున వాడుకమాటలతో రచించినటీక గవర్నమెంటు పుస్తకభాండాగారమందు ఉన్నది. శాళ్వపాకవారు కూడా అట్టిటీక రచించినారు. ఆసంప్రదాయముచొప్పున పరవస్తు శ్రీనివాసాచార్యులుగారు రచించిన సర్వశబ్దసంబోధిని అనే సంస్కృతాంధ్ర నిఘంటువులో సంస్కృతశబ్దములకు తెలుగున వాడుక

మాటలతో అర్థము వ్రాసినారు. వాల్మీకిరామాయణములోని కొంతభాగమునకు, సంస్కృతభాగవతములోని కొంతభాగమునకు, శ్రీశైలమహాత్మ్యమునకు, సౌందర్యలహరికి, శ్యామలాదండకమునకు, భర్తృహరిసుభాషితరత్నావళికి, కృష్ణకర్ణామృతమునకు వాడుకభాషలో రచించినటీకలు ఆ భాండాగారమునందే ఉన్నవి. వైష్ణవమతధర్మమును బోధించే అరవపుస్తకములకు తెలుగుటీకలు ఇట్లేఉన్నవి. ఇకను, తెలుగుప్రబంధములకుకూడా తెలుగుటీకలు వాడుకభాషలో రచించినవే ఉన్నవి గాని, గ్రాంథికభాషలోనున్నది మచ్చుకు ఒక్కటైనా ఎక్కడా ఇదివరకూ కనబడలేదు. రాఘవపాండవీయమునకు ప్రఖ్యాతపండితుడు ముద్దరాజు రామన్న; హరిశ్చంద్రనలోపాఖ్యానమునకు చిత్రకవి అనంతుడు; వసుచరిత్రకు సోమనాథపండితుడు, శిష్టుకృష్ణమూర్తిశాస్త్రి, జూలూరి అప్పయపండితుడు; మహాభారతమునకు భారతము లక్ష్మీపతిపండితుడు, మనుచరిత్రకు జూలూరి అప్పయపండితుడు; ఆముక్తమాల్యదకు గుట్టుపల్లి నృసింహకవి, గుడిపాటివెంకటకవి; రాఘవయాదవపాండవీయమునకు బాలసరస్వతి (?), లంకావిజయమునకు గ్రంథకర్త శిష్యుడు కోనూరి కృష్ణమాచార్యుడు, రామకృష్ణోపాఖ్యానమునకు కావ్యకర్తానూ వారణాసి లక్ష్మీపతికవిన్నీ చేసినటీకలు వాడుకభాషలోనే (సాహిత్యపరిషత్పండితులూ గవర్నమెంటు పుస్తకభాండాగారమందున్న పండితులూ నివేదించినట్లు) సంభాషణశైలిని రచితమైఉన్నవి. వీటిలో కొన్ని ప. చిన్నయసూరికీ, పూర్వము, కొన్ని అపిమ్మటను మొట్టమొదట అచ్చుపడ్డప్పుడు, వాటిలోనిటీక వ్రాతప్రతులలో ఉన్నట్లే వాడుకభాషలోనే ఉన్నది. పరవస్తు చిన్నయసూరిగారున్ను వైయాకరణ రామానుజాచార్యులవారున్ను కలిసి పరిష్కరించి 1847-వ సం.న భారతము ఆదిపర్వము అచ్చువేయించినప్పుడు, భారతవచనమనే పేరు పెట్టి ఆపుస్తకమందే ఆచార్యులవారు "భాషావ్యాఖ్యానము" వాడుకభాషలో రచించి

చేర్చి ప్రకటించినారు. ఈ ఆచార్యులవారు సూరిగారికన్న చాలా గొప్ప పండితులని విన్నాను. ఇటీవల, పూర్వటీకాకారుల ఊరూ పేరూ చెప్పకుండా వారిటీక గ్రాంథికభాషలోనికి మార్చివేసి, నేటి దొంగపరిష్కర్తలు అచ్చువేస్తున్నారు. ఎంతమోసము? ఎంతద్రోహము? దుష్టలక్షణమునకు విరుద్ధముగా ఉన్నవని చెప్పి, నన్నయాది మహాకవుల ప్రయోగాలు మార్చి గ్రంథాలు పాడుచేయుటకు సాహసించిన దొంగ "పండితులు" టీకలు మార్చుటకు జంకుదురా? ఇప్పటి అచ్చుటీకలు చదువుకొన్న ఆంధ్రపండితులు కొందరు వ్రాతపుస్తకములోని టీకలు గ్రాంథికాంధ్రమురాని అపండితులు వ్రాసినవని వాదించి తమఅజ్ఞానమున్ను అవివేకమున్ను ప్రకటించుకొన్నారు.

వ్యాకరణములు:—గ్రాంథికాంధ్రమనగా 'భారతాదిప్రాచీనాంధ్ర ప్రబంధములలోనున్న తెలుగు;' ఆ తెలుగుభాషకు ఆంధ్రశబ్దచింతామణి అనే వ్యాకరణమందు సంస్కృతభాషలో కొంతలక్షణము పూర్వము రచితమైనది. దీనికికూడా వ్యావహారికాంధ్రభాషలోనే బాలసరస్వతి అనే విద్వత్కవి టీకరచించినాడు; మరికొంచెము కాలము గడచినపిమ్మట, అప్పకవి అది ఆధారముగా చేసుకొని, పెద్దలక్షణగ్రంథము రచించినాడు. దానిలో పద్యాలు గ్రాంథికభాషలోను, వివరణము వ్యావహారికభాషలోను వ్రాసినాడు. అప్పకవీయము 1859-వ సం.న మొట్టమొదట అచ్చుపడ్డప్పుడు గ్రంథపరిష్కర్త శ్రీ రేకము రామానుజాచారి అనేపండితుడు (చిన్నయ్యసూరిగారి వియ్యంకుడు) వ్యావహారికభాష గ్రాంథికభాషగా మార్చివేసినాడు. నాటినుండి అలాగుననే ఆగ్రంథము మరలమరల చాలాకూర్పులలో అచ్చుపడ్డది. శ్రీవావిళ్ళ వేంకటేశ్వరశాస్త్రిగారు, తాళపత్రములలో ఉన్నట్టుగానే, ఆగ్రంథము నిరుడుముద్రించి ప్రకటించినారు. దానివల్ల నిజమైన సంప్రదాయము తెలియవచ్చును. దొంగపండితులు లోకమును మోసపుచ్చి చేసిన మార్పులు ఈలాగున మరల సవరించి వ్రాతప్రతులలో [illegible]

గ్రంథములు సరిగా ముద్రించి ప్రకటిస్తే కాని నిజము అందరికి వెల్లడి కాదు. బాలసరస్వతీయమూ అప్పకవీయమూ వలెనే, తక్కిన లక్షణగ్రంథములన్నీ పద్యములు గ్రాంథికభాషలోను, వివరణవచనములూ, అవతారికలూ మొదలయినవి వ్యావహారికభాషలోను రచితమయి ఉన్నట్టు వ్రాతప్రతులన్నిటిలోను దేశమందంతటా కనబడుతున్నది. ఆంధ్రశబ్దచింతామణికి అర్వాచీనులు రచించిన కవిజనాంజనమనే టీక మరిఒకటి ఉన్నది. అదిన్నీ అట్టిదే. గోపాలకవి రచించిన సకలలక్షణసారసంగ్రహమున్ను, మరిఒక "లక్షణగ్రంథమున్ను" పరిషత్తువారివద్ద నున్నవి. ఇవిన్నీ అట్లే రచితమయినవి. గవర్న మెంటువారి పుస్తకాలయములో ఇట్లు పూర్వులు రచించిన లక్షణగ్రంథములనేకముగా ఉన్నవి. అక్కడనే ఉన్నది శృంగారామరుశతకము. దీనిలోని శ్లోకములకు అర్థము తాళ్ళపాక తిరువేంగళాచార్యులు తెలుగున పద్యములుగా రచించి ప్రతిదానికి అవతారికా టీకా వాడుక మాటలతోనే చెప్పినాడు. కూచిమంచితిమ్మకవి, కూచిమంచి వేంకట్రాయుడు కావ్యములే కాక, లక్షణగ్రంథములు కూడా పూర్వాచారము చొప్పుననే రచించినారు. లక్షణగ్రంథాలకు ప్రతులు లక్షణమభ్యసించేవారే "స్వంతానకు" వ్రాసుకొనేవారు. మన తాతలనాడు జూలూరి అప్పయపండితుడు మొదలయినవారు బ్రౌను దొరగారికోసము ఆంధ్రభారతాది గ్రంథముల ప్రతులు అనేకము సంపాదించి ఒక్కొక్క గ్రంథములోని పాఠములు సంప్రతించి వ్రాసి పెట్టిన పీఠికలు, మనుచరిత్రకూ వసుచరిత్రకూ ఆయన టీకలు వ్రాసినట్టు వాడుకభాషలోనే రచించినారు. గవర్న మెంటువారి పుస్తకములను గురించి నేను చెప్పిన విషయములు అచ్చుపడి ఉన్న క్యాటలాగులనుబట్టిన్ని పరిషత్తువారి పుస్తకములను గురించిన విషయములు వారిపత్రికనుబట్టిన్ని చదువరులు తెలుసుకోవచ్చును.

ఈవ్యాసమం దుదాహరించిన వివిధగ్రంథములలోని వ్యావహారిక భాష ఎటువంటిదో తెలియజేయుటకు ఒక్కొక్కదానిలోనుండి కొన్ని వాక్యములు ఉదాహరించి అనుబంధముగా చేర్చవలెనని ఉద్దేశించినాను; గాని స్థలములేదు. నావ్యాసము సుమారు ఎనిమిదిపుటలలో ఇమిడేటట్టుండ వలెనని నిర్ణీతమైనది. ఈ వ్యావహారిక భాషాప్రయోజనములు 1914 సం॥ మున నేను ప్రకటించిన "నిజమైన సంప్రదాయ"మనే వ్యాసమందు చిన్న మచ్చువాక్యములు చేర్చిచూపించినాను. సవిస్తరముగా, సోదాహరణ ముగా, ఉపన్యసించి, ఈప్రయోజనములు మరల ప్రకటింపదలచి ఉన్నాను. ఆంధ్రప్రబంధములందుకూడా సరసకవులు వాడినవ్యావహారికభాష ప్రకటీక రింప నుద్దేశముగలవాడనై బాలకవిశరణ్యమనే గ్రంథము రచింప నారం భించి "నా" తెలుగుపత్రికలో కొంచెము అచ్చువేయించినాను. అది పూర్తిగా రచించి కొలదికాలములోనే అచ్చువేయిస్తాను. వ్యావహారిక భాషకు సారస్వత సామ్రాజ్యమందుగలహక్కులు పోగొట్టి దాని స్థానము ఆక్రమించి, భాషాప్రపంచములో దానిని నిలవనీయకుండా హింసిస్తూ, నిరంకుశాధికారము చెలాయిస్తూ ఉన్న గ్రాంథికభాషయొక్క ప్రవృత్తి ఎంత జుగుప్సావహముగా ఉన్నదో దానివికృతిచేష్టలు కొన్ని బట్టబయట పెట్టి పెద్దలందరికీ తెలిసేటట్టు చూపిస్తే, దానిని తొలగించి వ్యావహారికభాషను దానిపూర్వస్థానమందు మరల ప్రతిష్ఠాపించగలరని "కృతకగ్రాంథికాంధ్ర" మనే పేరుపెట్టి వేరే మరిఒక గ్రంథముకూడా రచించుటకు సంకల్పించి ఉన్నాను.

కట్టకడపటిమాట ఒకటిచెప్పి, నావ్యాసము ముగిస్తాను. తెలుగు దేశమందు మొట్టమొదటనుండీన్నీ అనేకశతసంవత్సరములు సమస్తసద్వ్యవ హారయోగ్యముగా అఖిలాంధ్రమహారాజపూజితమై, సకలసద్విద్యాభ్యాస సాధనముగా నిఖిలాంధ్రపండితావలంబనమై, ధర్మార్థకామమోక్ష[illegible]

పురుషార్థసాధకమై, తెలుగువారి దేశభాషగా మనతాతలనాటివరకున్ను ప్రఖ్యాతమైన మనమాతృభాష మననోటనూ మనపండితులనోటనూ అకుంఠి తాహార్యమై, సదావిహరిస్తూ ఉన్నా, మనకాలమందు అయ్యో ! పరమనీచమై నింద్యమై, హేయమై, పండితులకేకాక పామరులకున్ను, పెద్దలకేకాక పిల్లలకున్ను, నాలుగుజాతులవారికీ అస్పృశ్యలుగా ఉండి, తమ అస్పృశ్య తను తొలగించుకొనుటకు ప్రయత్నిస్తూ ఉన్న పంచములకున్నుకూడా అస్పృ శ్యమై, అవాచ్యమై, అధోగతిపాలయినది ! అహో ! కాలవిపర్యయము ! ఈవైపరీత్యమునకు మొదటికారణము 1853-వ సం.న పరవస్తుచిన్నయసూరి పూర్వసంప్రదాయవిరుద్ధముగా అనుశాసించిన నూతనమార్గము. అంతకు పూర్వమందున్ను, ఆకాలమందున్ను, సర్వసామాన్యముగా అందరిపిల్లలకూ కలిపి విద్యనేర్పుటకు ఏర్పడినబడులలో, ఉపాధ్యాయులు "లోకవ్యవహా రానుసారముగానే" విద్యార్థులచేత, మాతృభాషారచనాభ్యాసము చేయిస్తూ భారతాదిగ్రంథములలోని పద్యములు కొన్ని వాడుక మాటలలో అర్థము చెప్పి చదివించడము సదాచారమై ఉండగా, ప్రాచీనప్రబంధస్థమై, కేవల ప్రయోగశరణమై, పండితులకైనా బహుప్రయాససాధ్యమై, ఒక్క ప్రబంధ నిర్మాణమునందే ఉపయోగించదగి, పండితులు మాత్రమే అభ్యసిస్తూఉండిన "గ్రాంథికభాష"లో, అధికారానధికారతారతమ్యము ఆలోచించకుండా, ఆబాలగోపాలం అందరిపిల్లలచేతనూ, రచనాభ్యాసము చేయించ నుద్దేశించి, అందుకు సాధనముగా, అసమగ్రము, అనిర్ణాయకము, భ్రమప్రమాదాత్మక మున్ను అయిన చిన్నవ్యాకరణము ఒకటిన్ని అస్ఖలితముకాని చిన్న వచన గ్రంథమొకటిన్ని రచియించి ఇచ్చి, ఆసూరిగారు కీర్తిశేషులయినారు. "కొండవీటి సీమలోని నూతులలోనుండి నీళ్ళుతోడి తెచ్చుకొని వంటచేసు కొని భోజనముచేయుండి' అని బారెడు చేంతాడు, తూట్లుపడ్డ చిన్న చిల్లి

చెంబు ఆకలితోనున్న చిన్నపిల్లల చేతులలోపెట్టి, తల్లిదండ్రులు శ్రీశైలయాత్రకు వెళ్ళినట్లయినది.

పూర్వము మనదేశమందున్నట్టే, సత్సహవాసమాత్రముననే సంఘములోని వారందరికీ అలవడిన వర్తమానవ్యావహారిక భాష, గ్రాంథికభాషగా అభ్యసించడము ఏదేశములలో సదాచారముగా ఉన్నదో ఆదేశములలోని ప్రజలందరూ, నిరక్షరుడు ఒక్కడైనా లేకుండా ఎవరివృత్తికి ఉపచరించే వృత్తులు వారు సులువుగా నేర్చుకొని, తెలివితేటలు గలవారయి, స్వతంత్రులయి, రాజ్యవ్యవహారముకూడా స్వయం నిర్వహించుకొంటూ వృద్ధి పొందడముచూస్తే, మనదేశభాషకు మన అవివేకముచేతను సంభవించిన దౌర్భాగ్యమువల్లనే మనమిట్టి నిర్భాగ్యులమై ఉన్నామని తోచి, దేశాభిమానులకు దుఃఖము కలుగకమానదు. నేడు బ్రిటిష్‌సామ్రాజ్యవ్యవహారమంతా ఎవరు నిర్వహిస్తున్నారో విన్నారుకదా! చిన్నప్పటినుండిన్ని కాయకష్టమువల్లనే పొట్టపోషించుకొనే కామాటివాండ్రు రాజకార్యధురంధరులై మనచక్రవర్తికి మంత్రులుగా ఇప్పుడు ఉన్నారు. వీరందరూ ప్రాచీన గ్రాంథికాంగ్లభాషాపాండిత్యము గలవారు కారు. బాల్యమునుండిన్ని నాగళ్ళు, గుద్దళ్లు, గొడ్డళ్ళు, సమ్మెట్లు, పారలు, బొరిగలు మొదలయిన పనిముట్లు పట్టుకొని, చేతులు కాయలు కాచేటట్టు మోటుపనులుచేసి జీవించినవారు. అయితే, ఈకార్మికులు చదువురానివాళ్ళు కారు. చదువురాని వాళ్ళు ఆదేశమందు లేనేలేరు; ప్రతిమనిషీ అక్కడ చదువునేర్చుకోక తప్పదు. అందరికీ సామాన్యముగా ఉన్నవాడుకభాష రెండుమూడేండ్లు అభ్యసించి, ఎవరిపని వారు సాగించుకొంటూ, తీరికయినప్పుడు తమవృత్తి విద్య వృద్ధిపొందేటందుకు, అవిద్యలో ఆరితేరినవారు ఉపదేశించే విషయములు వింటూ, వారుప్రకటించేపుస్తకములూ, వ్యాసములూ చదువుతూ, తెలుసుకొన్నవిషయములు ఆచరణలోపెట్టిశోధిస్తూ, తమకు కొత్తగా తెలి

సినవిషయములు ఇతరులకు తెలిసేటట్లు ప్రకటిస్తూ, ఆదేశమందు కార్మికులు కూడా లౌకికవిద్యలు దినదినప్రవర్ధమానముగా చేస్తున్నారు. ప్రాచీనాంగ్ల భాషాపాండిత్యము, దేశాంతర భాషాపాండిత్యము వలెనే ఆవశ్యకమని కార్మికులు కూడా అంగీకరిస్తారు గాని, అది అందరికీ ఆవశ్యకమని తలంచరు. అపరిచితభాషలు అభ్యసించడమునకు తీరిక, ఓపిక, ఆసక్తి గలవారు అవి నేర్చుకొని, వాటిలో రచితమైన గ్రంథములందలి విషయములు దేశభాషలో సాధ్యమైనంత స్పష్టముగా ప్రకటీకరిస్తూ ఉంటారు. ఏభాషలోనున్నా, గ్రంథములో తెలుసుకోదగినది విషయముగాని, కేవలశబ్దము కాదు. మన దేశమందున్నట్టు ఆదేశమందు ప్రజలలో ప్రాచీనశబ్దదేవతార్చనచేసే పామరులూలేరు, చేయిస్తూ జీవనముచేసే యాజకులూ లేరు. చేస్తే పుణ్యమనీ చేయకుంటే పాపమనీ చెప్పే పండితపరిషత్తులూ లేవు.

గడచిన యాభై అరవై సంవత్సరములలో ఇతర దేశములందు జరిగినట్లే మన దేశమందున్న పరిస్థితులు మారినవి. ప్రజలలో అనిర్వచనీయమైన నూతనోత్సాహము పుట్టినది. సంఘవ్యవస్థ, రాజ్యవ్యవస్థ ప్రజలందరి శ్రేయోభివృద్ధికి అనుకూలమైనట్లు మార్చుటకు సాధనముగా విద్యావిధానము ఏర్పడినది. ఆపుణ్యకాలమందు ఇతరదేశములందు పరిణమించి ఉన్నట్లే మనదేశమందున్ను, విద్యాభ్యాసమునకు అనుకూలసాధనమై పరిణమించి ఉన్న మనవ్యావహారిక భాషే ఇతరదేశములలో చేసినట్టు, మనదేశమందు కూడా బడులలో విద్యాబోధకు సాధనముగా చేసిఉంటే, ఆదేశములలో వ్యాపించినట్లే, మనదేశమందున్న ప్రజలలో విద్య వ్యాపించి, మనదేశభాష మెరుగెక్కి ప్రకాశిస్తూ ఉండునుగదా! సర్వజనసామాన్యమైన సారస్వతము విజృంభించి ఉండునుగదా! ఇంగ్లీషువారికైనట్టే సమస్తదేశముల విజ్ఞానమున్ను, మనతెలుగువారందరికీ మన తెలుగులోనే సుగమము, సులభము అయి, వారివలెనే మనమున్ను విజ్ఞానసంపన్నులముఅయి ఉందుముగదా!

ఇతరజాతులవారితో మన తెలుగువారున్ను సమముగా తులతూగుతూ ఉండురుగదా. ఇప్పుడు ఇంగ్లాండుదేశములో కుండలుచేసే కుమ్మరివాండ్లూ, గనులలో బొగ్గుత్రవ్వే ఉప్పరులూ, పొలములుదున్నే పాలికాపులూ, యంత్రాలుతోలే కూలివాండ్లూ, సామ్రాజ్యవ్యవహార నిర్వాహదక్షులగుటకు చాలినంతయోగ్యత వర్తమానవ్యవహారాంగ్లభాషద్వారా సంపాదించినట్టే, మనదేశములోని కార్మికులుకూడా వర్తమానవ్యావహారికాంధ్రభాషద్వారా మనదేశవ్యవహార నిర్వాహదక్షులగుటకు తగినయోగ్యత సంపాదించి ఉండురుగదా! ఇంతకుపూర్వమే స్వరాజ్యము మనకు సిద్ధించిఉండునుగదా! అయితే మనదురదృష్టమువల్ల చిన్నయసూరి గ్రాంథికభాషా దురభిమానము, విద్యాధికారుల అవివేకముచేత మారిమసగినట్టు చెలరేగి, వాస్తవమైన దేశభాషను నాశనముచేసి, మనకీదుర్దశకలిగించినది. ఈమారీబాధను తొలగించుటకే పదిపండ్రెండేండ్లక్రిందట, పూర్వులతప్పు తెలిసికొని, ప్రభుత్వము వారు వ్యావహారికభాషను తిరిగీ ఉద్ధరించుటకు పూనుకొంటే, వారియందు విశ్వాసములేని మనదేశనాయకులు, ఈమారమ్మపూజారులను, వారు ఆడించినట్లు ఆడి కేకలువేసే మారీభక్తులను వెనుకబెట్టుకొని, ప్రభుత్వమువారికి ప్రతిఘటించి, వారి ప్రయత్నము నిష్ఫలంచేసి, ఆంధ్రసారస్వతనిర్మాణము తిరిగీ ఈ పూజారులకే గుత్తకిచ్చివేసినారు. ఇంగ్లాండులోని ఇప్పటికార్మిక మంత్రుల నోటినుండివెడలిన ప్రతి శబ్దమూ సభ్యమై సార్థకమై, టెలిఫోనుల ద్వారానూ, టెలిగ్రాఫులద్వారానూ, కేబిల్‌గ్రాములద్వారానూ, వైర్‌లెస్సులద్వారాను, మహాసముద్రములుదాటి, ప్రపంచమంతావ్యాపించి మారుమోగుతూ పత్రికలలోను పుస్తకములలోను ప్రకటించుటకు యోగ్యమై ఉంటే, మనపరిషత్ పండితులు మాట్లాడేభాష అవాచ్యమా? నింద్యమా? నీచమా? "గ్రామ్య" భాషా? ఎంత అవివేకము! పండితులున్ను, వారి నిరంతర బోధచేత మూఢులై ఉన్న వారి శిష్యులున్ను, మంచీచెడ్డా తెలుసుకోలేక

ఎవరేమన్నా గంగిరెద్దులాగున తల ఊపే పామరజనులున్ను సభ్యమని మెచ్చుకొనే "గ్రాంథికాంధ్రము" ఎవరినోటనూ వెల్వడదు; ఎవరిచెవినీ పడదు! ఇకనైనా పెద్దలు మేల్కొంటారా? మేల్కోరా? దేశీయమహాసభవారందరికీ వినబడేటట్లు "ఇకనైనా మేలుకోండి మనజన్మహక్కులను గోరండీ!" అని ఆదిమాంధ్రకవి కుసుమ ధర్మన్నగారు తమ సంఘమువారిని ఉద్బోధిస్తూ మేలుకొల్పు పాటపాడినారు. తమనోటిమాటే అవాచ్యమని అస్పృశ్యమని బహిష్కరించిన తమ పొరుగువారిని అవాచ్యులని అస్పృశ్యులని నిందించి మానవ్రతులై మడికట్టుకొని వేరేకూర్చున్న పండితులు ఇతరుల మొర్రవింటారా? ప్రజల వాడుకభాషయొక్క ప్రయోజనములు అంగీకరించని పండితులచేతిలోనున్న అంకుశము తీసివేస్తేనేకాని, ప్రజలహక్కులను నిరోధిస్తూ ఉన్నప్రభుత్వమువారి చేతిలోని అంకుశమును లాగివేసిన ప్రయోజనముండదు. నేడు ఆంధ్రరాష్ట్రము ఏర్పడవచ్చును; రేపు స్వరాజ్యము రావచ్చును; ప్రభుత్వము ప్రజాస్వామికము కానూవచ్చును. అయితే, ఈ రోజులలో మనస్వాములు నిరక్షరకుక్షులయి ఉంటే, దేశమునకు ఎంత ఉపద్రవము కలుగునో మన దేశనాయకులు, దేశభక్తులు, దేశబంధులు లెస్సగా ఆలోచించవలసి ఉన్నది. మన తెలుగువారిలో నూటికి 90 మందికి ఇంకా ఓనమాలైనా రావునుమండీ!

దేశ మన్నివిధములా అభివృద్ధిపొందడానికి అనుకూలమయేటట్టుగా, మునుపు ఉన్నట్టే, వర్తమానవ్యావహారికభాషే గ్రాంథికభాషగా అంగీకరించకతప్పదు. అదే లోకైకశరణము. ప్రాచీనాంధ్రభాషారచన పోషించవలెనని ఆంధ్రసాహిత్యపరిషత్తువారికి ఉద్దేశముంటే వారు అట్లుచేయవచ్చును. కానిఅందుకొరకై వ్యావహారికభాషను అణగద్రొక్కుటకు వారికి అధికారము లేదు. వారుచేసిన వ్యావహారికభాషాబహిష్కారము గొప్పతప్పు. దేశాభివృద్ధికి ప్రతికూలమయినది. వారు చేసిన పని ప్రాచీన షట్ సంప్ర

దాయమునకు విరుద్ధమయినదని తెలిసిన తరువాత నయినా తప్పుదిద్దుకొని బహిష్కారము రద్దుచేయుటవారికి విహితకృత్యము. చెన్నపట్టణమందు మొదట గ్రామ్యభాషా నిరసనసభ జరిగినప్పుడు అధ్యక్షుడుగా ఉండి పరిషత్తు వారి ఉద్యమమునకు ఆలంబన స్తంభమై నిలచిఉండిన కందుకూరి వీరేశలింగంపంతులుగారు దురభిమానము లేనివారు గనుక నావల్ల ప్రాచీన సంప్రదాయము తెలుసుకొన్న వెంటనే నాతో ఏకీభవించి వర్తమానవ్యావహారికాంధ్రభాషాప్రవర్తకసమాజము (28-2-1919) తేదీన స్థాపించి వారే దానికి అధ్యక్షులయినారు.